بِسْمِ اللّٰہِ الرَّحْمٰنِ الرَّحِیْمِ     نَحْمَدُہٗ وَنُصَلِّی عَلٰی رَسُوْلِہِ الْکَرِیْمِ     وَعَلٰی عَبْدِہِ الْمَسِیْحِ الْمَوْعُوْدِ

# Summary of Friday Sermon Huzur-e-Anwar 15.07.2016 (Telugu)

**జమాఅత్ సేవను సాధారణ సేవగా పరిగణించకూడదు. మీరు స్వీకరించిన మీకు అప్పగించబడిన ఈ పదవులు ప్రతిజ్ఞలని అల్లాహ్ తఆలా స్పష్టముగా తెలిపిన విషయమును సదా గుర్తుంచుకొనుము. కనుక తమ పదవులను, ప్రతిజ్ఞలను నిర్వర్తించుము.**

*హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ 15.07.2016 తేదీన మస్జిద్ మహమూద్ - స్వీడన్ లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, తస్మియ, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ప్రసంగించిరి.

ఇది జమాఅత్ పదవిదారుల ఎన్నికల సంవత్సరమని నేను కొంత కాలము క్రితం ప్రస్తావించినాను. ఇప్పుడు అనేక చోట్ల ఎన్నికలు ముగిసినవి. జాతీయ స్థాయిలో కూడ స్థానికంగా కూడ క్రొత్త పదవిదారులు తమ బాధ్యతలను స్వీకరించినారు. క్రొత్తగా ఎన్నికైన వారు అల్లాహ్ తఆలా జమాఅత్ సేవ కొరకు తమను ఎన్నుకొన్నాడని కృతజ్ఞతలు తెలుపుచు అల్లాహ్ తఆలా ఆస్థానములో మోకరిల్లుచు వినయముతో తమకు అప్పగించబడిన పదవి హక్కులను చెల్లించుటకు అల్లాహ్ తఆలా అనుగ్రహించాలని సహాయము యాచించవలెను. మరల ఎన్నుకోబడిన పదవిదారులు కూడ మరల సేవ చేయు అనుగ్రహము అల్లాహ్ తఆలా కల్పించినాడని ఒక వైపు కృతజ్ఞతలు తెలుపుచు రెండవ వైపు ఇట్లు దుఆ చేయవలెను. పూర్తి సామర్థ్యములతో పదవుల హక్కు చెల్లించుటకు అల్లాహ్ తఆలా అనుగ్రహించుగాక! గత సేవలో తమచే దొర్లిన లోపములు, అలసత్వములు, నిర్లక్ష్యముల వలన పదవుల హక్కు చెల్లించలేక పోయినందున అల్లాహ్ తఆలా క్షమించుగాక! అనంతరం తన శుభము కలిగించుచు రాబోవు మూడు సంవత్సరముల కొరకు మరల సేవ చేయుటకు అనుగ్రహించెను. తమకు అప్పగించబడిన పదవుల పట్ల లోపములు, అలసత్వములు, నిర్లక్ష్యములు జరగకూడదని, ఈ పదవుల హక్కు చెల్లించుటకు అనుగ్రహించుగాక! జమాఅత్ సేవను సాధారణ సేవగా పరిగణించకూడదు. మీరు స్వీకరించిన మీకు అప్పగించబడిన ఈ పదవులు ప్రతిజ్ఞలని అల్లాహ్ తఆలా స్పష్టముగా తెలిపిన విషయమును సదా గుర్తుంచుకొనుము. కనుక తమ పదవులను, ప్రతిజ్ఞలను నిర్వర్తించుము. ఒక చోట అల్లాహ్ ఆఆలా తమ మాట ప్రకారము నడిచేవారి చిహ్నము గురించి ఇట్లు తెలిపెను. وَالْمُوْفُوْنَ بِعَهْدِهِمْ اِذَا عٰهَدُوْا (అల్ బఖరహ్:178) అనగా వాగ్దానములు చేసినప్పుడు తమ వాగ్దానములను నిర్వర్తించువారు. ఇదొక ప్రత్యేక గుర్తింపుగా యుండవలెను. జమాఅత్ కార్యముల నిర్వహకులు ప్రత్యేకముగా సదా నిస్టాపరతపై నిలుచుచు, తమ నిస్టాపరత స్థాయిని పెంచుకొంటూ తమ కార్యమును నిర్వర్తించవలెను. వారి సత్య స్థాయిలో ఏమాత్రం తగ్గుదల యున్నను, లోపమున్నను వారి నిష్టాపరత స్థాయి జమాఅత్ ఒక సాధారణ వ్యక్తికి ఆదర్శం కానిచో వారు తమ ప్రతిజ్ఞ, తమ పదవుల, తమ న్యాసముల హక్కు చెల్లించువైపు శ్రద్ధ వహించడం లేదని స్పష్టమగును. కనుక అమీర్లు, సదర్లు తమ కార్యవర్గము కొరకు, జమాఅత్ సభ్యుల కొరకు ప్రథమంగా తాము ఆదర్శముగా నిలువలెను. సంస్కరణ (తర్బియత్) కార్యదర్శులున్నారు. సంస్కరణ కార్యము వీరికి అప్పగించబడెను. ఆదర్శములు ఏర్పడినప్పుడే సంస్కరణ కార్యము మంచిగా జరుగును. బాధ్యులకు, ఇతరులకు ఉపదేశములు చేయువారు స్వయముగా ఆచరించవలెను. జమాఅత్ సంస్కరణ బాధ్యత తమకు అప్పగించబడినందున సంస్కరణ కార్యదర్శులు జమాఅత్ సభ్యులకులకు ఆదర్శముగా నిలువలెను. సంస్కరణ శాఖలు క్రియాశీలకం అయినచో ఇతర శాఖల కార్యములు వాటంతట అవే అగునని నేనింతకు ముందు అనేక సార్లు చెప్పినాను. జమాఅత్ సభ్యుల సంస్కరణ స్థాయి ఎంత

గొప్పగా యుండునో అంతే ఇతర శాఖల కార్యములు సులభముగా అగును. సాధారణ వ్యవహారముల (ఉమూరె అమ్మ) కార్యదర్శి పని సులభముగా అగును. ప్రచార కార్యదర్శి పని సులభమగును. న్యాయ విభాగ పని సులభమగును. సంస్కరణ కార్యమును మొదట తమ గృహము నుండి ప్రారంభించాలని నేను తరచుగా కార్యవర్గ సమావేశములలో అంటుంటాను. ఈ గృహము అనగా కేవలం తర్బియత్ కార్యదర్శి గృహము మాత్రమే గాక కార్యవర్గములోని ప్రతి సభ్యుని గృహము. అన్నిటికంటే ముఖ్యముగా కార్యవర్గము తమను తాము సంస్కరించుకోవలెను. జమాఅత్ అమీర్/ సదర్ జమాఅత్, తర్బియత్ కార్యదర్శి ఏ కార్యక్రమము నిర్వహించినా తమ కార్యవర్గము దీటిని పాటించుచున్నదా లేదా అని ముందుగా గమనించవలెను. అల్లాహ్ తఆలా ప్రాథమిక ఆదేశములు, మానవ జన్మ ఉద్దేశమును కారవ్యర్గ సభ్యులు పాటించుచున్నారా ? లేనిచో నిష్టాపరత లేదు. అల్లాహ్ తఆలా హక్కులలో అన్నిటికంటే పెద్ద హక్కు ప్రార్థన. ఇందులకు నమాజులను స్థాపించాలని, బాజమాఅత్ సలుపుటకు ప్రయత్నించవలెనని పురుషులకు ఆదేశము గలదు. తద్వారా మన మస్జిదులు ఆవాసం పొందుటయే గాక, నమాజ్ కేంద్రములు ఆవాసం పొందుటయే గాక అల్లాహ్ తఆలా శుభములను కూడ పొందువారమగుదుము. తమ ఆచరణాత్మక ఆదర్శముతో జమాఅత్ సభ్యులను కూడ సంస్కరించువారమగుదుము. అల్లాహ్ తఆలా అనుగ్రహములకు వారసులగుదుము. వారి కార్యములలో కూడ సౌలభ్యము కలుగును. కేవలం మాట్లాడువారము కాము. తమ మాట, పని ఎంత వరకు సమానంగా యున్నవో బాధ్యతగల వారు ముందుగా ఆత్మ పరిశీలన చేసుకోవలెను. అల్లాహ్ తఆలా ఇట్లనెను. يَآيُّهَا الَّذِيْنَ اٰمَنُوْا لِمَ تَقُوْلُوْنَ مَا لَا تَفْعَلُوْنَ (అస్సఫ్:3) అనగా ఓ విశ్వాసులారా! మీరు చేయని దానిని ఎందుకందురు? చెప్పి ఆచరించని వారుండిరి, యున్నారు, యుందురని ఈ సూక్తి తెలుపుచున్నదని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అనిరి. సత్యమైన హృదయముతో కాని, ఆచరణ శక్తి లేని మానవుని సంభాషణ ప్రభావము చూపదని మీరు నా విషయమును వినుము, గట్టిగా గుర్తుంచుకొనుము.

మన మాట, కార్యములో వ్యత్యాసము యుండకూడదు. అన్నిటికంటే ఎక్కువగా ఈ విషయమును మన పదవిదారులు తమ దృష్టిలో యుంచుకోవలెను. దూరము ఎక్కువ యున్న చోట, తక్కువ గృహములు యున్న చోట, మస్జిదులు లేని చోట, నమాజ్ కేంద్రములు లేని చోట గృహములలో నమాజుల ఏర్పాటు చేయవచ్చును. ఆచరణలో ఇది కష్టమేమి కాదు. ఇదొక ప్రాథమిక విషయము. మానవుని జన్మ ఉద్దేశము ఇదే. దీని హక్కును మనము చెల్లించవలెను. ఇందులో ప్రత్యేకముగా పదవిదారుల వైపున ఎలాంటి అలసత్వము కాకూడదు. వాస్తవానికి నిజమైన విశ్వాసి వైపున కూడ అలసత్వము కాకూడదు. ఏ పదవిదారుడు కూడ అధికారి అగు ఆలోచనతో, లేదా అధికారిగా చేయబడు భావనతో నియమించబడడు. ఇస్లాంలో పదవిదారుని భావనే భిన్నముగా యున్నది. జాతి నాయకుడు జాతి సేవకుడని ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తెలిపినారు. కొన్ని సార్లు పదవిదారులు కొన్ని మాటలను వినవలసి వచ్చును. వినవలసి వచ్చినచో వినవలెను. తమ ఓర్పు స్థాయి ఎంత వరకున్నదో, తమ వినయ స్థాయి ఎంత యున్నదో పదవిదారులు స్వయముగా పరిశీలించుకోవచ్చును. ఓర్పు ఏ మాత్రం లేదని కొందరి పదవిదారుల గురించి కొన్ని వ్యవహారములు బయట పడును. ఎవరైనా అమర్యాదగా వ్యవహరించినచో వీరు కూడ కోపమును చూపింతురు. ఈ ఉదాహరణలు కూడ లభించును. మస్జిదులలో కూడ వివాదములు మొదలగును. ఈ విషయములు బాలలో, యువకులలో దుష్ప్రభావము చూపును.

పదవిదారులకు లేదా కేంద్రము నుండి నివేదిక పంపవలెనని కొన్ని వ్యవహారములు పంపబడినప్పుడు నిర్లక్ష్యముగా వ్యవహారముల గురించి నివేదిక పంపబడుచున్నది. సరియైన రీతిలో పరిశోధించరు. లేదా నివేదిక పంపబడదు. లేదా సమస్యను ఆలస్యము చేయుదురు. తద్వారా అవసరమున్న ఒక వ్యక్తి అవసరము పూర్తి

అగుటకు దరఖాస్తు ఇచ్చినచో సమయమున అతని అవసరము తీరనందున అతనికి నష్టము కలుగును లేదా బాధను భరించవలసి వచ్చును. కొందరు పదవిదారులు తమ పనిభారమును సాకుగా చూపుదురు. కొందరి వద్ద ఎలాంటి సాకు యుండకున్నను నిర్లక్ష్యము వహింతురు. కాని వారి స్వంత పనులైనచో లేదా సమీపుల పని అయినచో ప్రాధాన్యతలు మారిపోవును. నిజమైన సేవ ఉత్సాహము, త్యాగ ఉత్సాహము, తమ పదవి సరియైన హక్కును చెల్లించుట అనగా ఒక వ్యాకులతతో ఇతరులకు ఉపయోగపడవలెను. ఇటువంటి త్యాగ స్ఫూర్తితో ఇతరుల బాధలను తమ బాధలుగా గుర్తించి పని చేసినప్పుడు జమాఅత్ సభ్యుల త్యాగ స్థాయి కూడ పెరుగును. ఒకరు మరొకరి హక్కులను హరించే బదలు హక్కులు చెల్లించే వైపు శ్రద్ధ కలుగును. ప్రతి స్థాయిలో హక్కులు హరించే బదులు హక్కులు చెల్లించే స్ఫూర్తి, త్యాగము ఏర్పడవలెనని మనము ఇతరుల ముందు అంటుంటాము. కాని మనలో ఈ స్థాయి లేనప్పుడు అల్లాహ్ తఆలాకు ఇష్టము లేని పని చేసనివారమగుదుము. పదవిదారులలో ప్రత్యేకముగా యుండవలసిన మరో లక్షణము వినయము. ఎవరేని పదవిదారుని హృదయములో తమ పదవి వలన ఎటువంటి గర్వము కలిగినచో లేదా అహంకారము ఏర్పడినచో ఈ విషయము అల్లాహ్ తఆలా నుండి అతన్ని దూరము చేయునని అతడు గుర్తుంచుకోవలెను. మానవుడు అల్లాహ్ తఆలా నుండి దూరమైనప్పుడు పనిలో శుభము యుండదు. అప్పుడు ఇటువంటి వ్యక్తి జమాఅత్ కొరకు ప్రయోజనము బదలు నష్టమునకు కారకుడగును.

కొందరు సాధారణ పరిస్థితులలో కలిసినప్పుడు ఎంతో వినయమును చూపుదురు. కాని తమ క్రింది వారిలో లేదా ఒక సాధారణ వ్యక్తితో భేదిభిప్రాయము ఏర్పడినప్పుడు తక్షణమే తమ అధికార నాడి మేల్కొనును. తాము పెద్ద పదవిదారులను ఆలోచన వారితో తమ క్రింది వారి పట్ల అహంకారమును బహిర్గతము చేయించును. కనుక ఇది వినయము కాదు. కృత్రిమ వినయము. తమ క్రింది ఉద్యోగి అభిప్రాయ భేదము వ్యక్తపరచినప్పుడు, తమ ఇష్టమునకు విరుద్ధముగా మాట్లాడినప్పుడు అసలు విషయము తెలియును. అప్పుడు న్యాయమును అవలంభించుచు ఆ అభిప్రాయముపై క్షుణ్ణంగా ఆలోచించి నిర్ణయము తీసుకోవలెను.

పదవిదారులలో యుండవలసిన మరో ప్రత్యేకత ఏమనగా తమ సిబ్బందితో సత్ప్రవర్తనతో వ్యవహరించవలెను. జమాఅత్ కార్యములను నడిపించుటకు సదా ఉద్యోగులు అందుబాటులో యుండుటకు ఇదే సత్ప్రవర్తనతో తమ ఉపాధికారులకు, సిబ్బందికి పని నేర్పుటకు కూడ కృషి చేయవలెను. హజ్రత్ ఖలీఫతుల్ మసీహిస్సాలిస్ (రహ్మ) హయాంలో నా కార్యాచరణ, నా కష్టము వలన జమాఅత్ ఆర్థిక వ్యవస్థ ఉత్తమముగా నడుచుచున్నదని ఒక అధికారి భావించెను. హజ్రత్ ఖలీఫతుల్ మసీహిస్సాలిస్ (రహ్మ) గారికి ఈ విషయము తెలిసినప్పుడు ఆ అధికారిని తొలగించి ఆర్థిక విషయములు బొత్తిగా తెలియని వ్యక్తిని ఆ కార్యముపై నియమించిరి. ఇది అల్లాహ్ తఆలా కార్యము అయినందున, వర్తమాన ఖలీఫాతో అల్లాహ్ తఆలాకు సంబంధమున్నందున ఏమియును తెలియని క్రొత్తగా వచ్చిన ఆ అధికారి పనిలో ఎంత వరకు శుభము ఏర్పడినదనగా అంతకు ముందు ఊహించను కూడ ఊహించలేదు. పదవిదారులకు అల్లాహ్ తఆలా అవకాశము కల్పించును. ఉద్యోగులకు అల్లాహ్ తఆలా అవకాశము కల్పించును. జమాఅత్, ధర్మ సేవ చేసి అల్లాహ్ తఆలా శుభములకు వారసులగుటకు అల్లాహ్ తఆలా జీవిత సమర్పితులకు అవకాశము కల్పించును. వాస్తవానికి పనులను అల్లాహ్ తఆలా స్వయముగా చేస్తున్నాడు. ఇది అతని వాగ్దానము. కనుక నా అనుభవము, నా విద్య జమాఅత్ పనులను కొనసాగించుచున్నదని ఎవరికి ఆలోచన కలుగకూడదు.

చిరునవ్వు, మంచి ప్రవర్తనతో వ్యవహరించు లక్షణము కూడ పదవిదారులలో యుండవలెను. అల్లాహ్ తఆలా ఇట్లనెను. وَقُوْلُوْا لِلنَّاسِ حُسْنًا (అల్ బఖరహ్: 84) అనగా సోదర మానవులతో దయతో మాట్లాడుము. ఇది కూడ

ఒక ప్రాథమిక గుణము. పదవిదారులలో అధికముగా యుండవలెను. తమతో పని చేసేవారితో, తమ క్రింది సిబ్బందితో మాట్లాడినప్పుడు లేదా ఇతరులతో మాట్లాడినప్పుడు తమ గొప్ప సద్గుణములు వెలువడేటట్లు చూసుకోవలెను. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తాను నియమించిన యమన్ గవర్నరులను ఇట్లు ఉపదేశించిరి. ప్రజల కొరకు సౌకర్యములను ఏర్పాటు చేయుము. కష్టములను కలిగించకుము. ప్రేమ, ఆనందమును వ్యాపింపజేయుము. ద్వేషమును సృష్టించకుము. ఇది ఎటువంటి ఉపదేశమనగా పదవిదారుల, జమాఅత్ సభ్యుల మధ్య కూడ సంబంధములలో సౌందర్యమును ఏర్పాటు చేయును. దీని ఫలితముగా పరస్పరము జమాఅత్ సభ్యులలో కూడ ఒకరు మరొకరి భావములను గుర్తించే స్ఫూర్తి ఏర్పడును.

కేంద్రము నుండి అందిన ఆదేశములు లేదా సర్క్యులర్‌లను వెంటనే స్వయముగా ఆచరించి, జమాఅత్‌ల ద్వారా ఆచరింపజేయుట అమీర్లు, సదర్లు, కార్యదర్శుల ఒక పెద్ద కర్తవ్యము. కేంద్ర ఆదేశములను పూర్తిగా ఆచరించడం లేదని కొన్ని జమాఅత్‌ల గురించి నివేదికలు అందుతాయి. తమ తెలివిని ఉపయోగించుచు ఆ ఆదేశమును ప్రక్కకు పెట్టడం లేదా దానిని పాటించకపోవడం, కేంద్రమునకు కనీసం సమాచారమివ్వక పోవడం ఏమాత్రం సమంజసమైన విషయము కాదు.

వసియ్యత్ చేసిన వారి గురించి నేను చెప్పదలచిన విషయమేమనగా తమ చందాను సక్రమంగా చెల్లించుట దానిని భద్రపరచుట మూసి బాధ్యత. కాని మూసీల లెక్కలను పూర్తి చేయుట కేంద్ర కార్యాలయ లేదా సంబంధిత కార్యదర్శుల కర్తవ్యము కూడ. వారి చందా స్థితిగతుల గురించి అవసరమొచ్చినప్పుడు గుర్తు కూడ చేయవలెను.

ముబల్లిఘీన్లు, మురబ్బీల గురించి కూడ నేనొక విషయము చెప్పదలచితిని. కొన్ని చోట్ల మురబ్బీల, ముబల్లిఘీన్ల మీటింగులు క్రమం తప్పకుండా జరగవు. ఈ మీటింగులు క్రమం తప్పకుండా నిర్వహించు బాధ్యత ముబల్లిఘ్ ఇన్‌చార్జులది. జమాఅత్ సంస్కరణ, ప్రచార కార్యములను పరిశీలించవలెను. మంచిగా జరిగిన పని గురించి చర్చ జరగవలెను. జమాఅత్ కార్యదర్శులు జమాఅత్‌లకు ఆదేశించిన విషయములు, కేంద్ర ఆదేశము ప్రకారము జమాఅత్‌లకు పంపే విషయముల గూర్చి కూడ నివేదిక పంపవలెను. ఈ విషయములో ప్రతి జమాఅత్‌లో ఎంత పని జరిగినదో మురబ్బీలు గమనించవలెను. ప్రత్యేకముగా ప్రచారము, సంస్కరణ, ఆర్థిక కార్యదర్శులు క్రియాశీలకంగా లేని చోట మురబ్బీలు, ముబల్లిఘీన్లు వారికి శ్రద్ధ కలిగించవలెను. అల్లాహ్ తఆలా రాబోవు మూడు సంవత్సరముల కొరకు తమకు సేవ చేయు అవకాశము కలిగించినందున అధికాధికముగా పని చేయు అనుగ్రహము లభించుటకు పదవిదారులందరు దుఆ చేయవలెను. తమ ప్రతి మాట, కర్మతో జమాఅత్‌లో ఆదర్శముగా నిలుచు వారగుదురు గాక! (ఆమీన్)

BOOK POST (PRINTED MATTER)

To,

.....................................................................

.....................................................................

.....................................................................